క్లుప్తంగా

ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనారాయణస్వామి



బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన లక్ష్మీనారాయణ స్వామివారిని బుధవారం ప్రత్యేకాలంకరణ చేశారు. చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 13 వరకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణంలో భాగంగా స్వామి, అమ్మవార్ల తలపై తలంబ్రాలు పోస్తున్న పండితులు

పెదపూడి: వేండ్ర గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి వార్షిక కల్యాణం బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. వైఖానస ఆచారం ప్రకారం పండితులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, హనుమంతాచార్యుల పర్యవేక్షణలో అర్చకుడు సత్యకృష్ణమాచార్యులు, ఇతర పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రంగంపేట ఈఈ దాట్ల శ్రీధరవర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రంగంపేట సబ్ స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వివరించారు.

రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాజానగరం: మండలంలోని తోకాడ నుంచి రాధేయపాలెం మీదుగా చక్రద్వారబంధానికి రూ.4.6 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరితో కలిసి బుధవారం శ్రీకారం చుట్టారు. పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేసి, మెరుగైన రవాణా సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.
సీతానగరం: రామచంద్రపురం, సీతానగరం డిగ్రీ కళాశాల, రఘుదేవపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే, రుడా చైర్మన్ శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.
కోరుకొండ: శ్రీరంగపట్నం-మునగాల, కోటి-కోటికేశవరం గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శంకుస్థాపన చేశారు. రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరి, పెందుర్తి అభిరామ్ పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు

- మితిమీరిన భారీ వాహనాల జోరు
- బెంబేలెత్తుతున్న వివిధ గ్రామాల ప్రజలు
- రాత్రి వేళల్లోనూ సాగుతున్న రాకపోకలు
- నిబంధనలకు విరుద్ధంగా ట్రిప్పులు



కోరుకొండలో రాత్రి వేళ భారీ వాహనాల జోరు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని ప్రకృతి వనరులు దోపిడీ యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు అనేక గ్రామాల్లో ఆందోళనకరంగా మారాయి. పది నుంచి ఇరవై చక్రాల వరకూ భారీ వాహనాలు అపరిమిత వేగంతో దూసుకుపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రమైన కోరుకొండతో పాటు, 24 గ్రామాల్లోనూ భయానక వాతావరణం నెలకొంది. ఉద్యోగాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లేవారు, పొలాలు, తోటలకు వెళ్లే రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు ఇలా ఆయా రహదార్లలో ప్రయాణించే వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రకృతి సంపదైన మట్టి, ఇసుక, గ్రావెల్, నల్లరాయి వంటి వాటిని ఇష్టారాజ్యంగా రవాణా చేసేందుకు రేయింబవళ్లు భారీ వాహనాలను వినియోగించడం ఆయా ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారింది.

అపరిమిత వేగంతో..

భారీ వాహనాల ద్వారా మట్టి, ఇసుక, కంకర రవాణా జరుగుతోంది. తొందరగా గమ్యాలకు చేరుకోవాలన్న ఆతృతతో డ్రైవర్లు అపరిమిత వేగంతో లారీలను నడుపుతున్నారు. దీంతో గ్రామాల్లో నిత్యం ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఎక్కువ ట్రిప్పులు వేయాలన్న ఆలోచన మినహా.. రోడ్లపై ప్రజలు ఏమవుతారన్న కనీస దృష్టి డ్రైవర్లకు ఉండడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు.

వందలాదిగా..

టన్నుల కొద్దీ సరకును తరలిస్తున్న 14, 20 చక్రాల లారీలు వందలాదిగా నడుస్తున్నాయి. ఒక్కో లారీలో 22, 25 టన్నుల సరకు లోడ్ అవుతోందంటున్నారు. నిబంధనల ప్రకారం 16-18 టన్నులు మాత్రమే లోడ్ చేయాలి. పరిమితికి మించి లోడ్ చేయడంతో ఎక్కడికక్కడ మట్టి, కంకర రోడ్లపైనే పడిపోతుంది. వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనదారుల కళ్లలో మట్టి, గ్రావెల్ పడడం సాధారణంగా మారింది. భారీ వాహనాల వారు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం ఇతర ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారుతోంది.



సరకు రవాణా చేస్తున్న భారీ వాహనం

ప్రయాణిస్తున్న మార్గాలివే..

మండలంలో శివారు ప్రాంతాలైన గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, రాఘవపురం నుంచి భవన నిర్మాణాలకు ఉపయోగించే కంకర రవాణా జరుగుతోంది. అలాగే మండల సరిహద్దునున్న ఏజెన్సీ ప్రాంతంలోని క్వారీల నుంచి గ్రావెల్ కోరుకొండ మీదుగా రవాణా జరుగుతోంది. ఈ రోడ్డుకు అనేక గ్రామాలు అనుసంధానంగా ఉన్నాయి. భారీ వాహనాలు సరకుతో తెల్లవారుజాము నుంచి రాత్రివేళల్లోనూ ప్రయాణిస్తున్నాయి. అలాగే రాఘవపురం, గాదరాడ, నర్సాపురం గ్రామాల వైపు నుంచి మట్టి రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులు ఈ భారీ వాహనాలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కల్పించాలి

భారీ వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. యథేచ్ఛగా మట్టి, గ్రావెల్, కంకర అక్రమంగా రవాణా చేస్తున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. భారీ వాహనాలను రాత్రి వేళల్లోనే అనుమతించాలి. భారీ వాహనాల నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలి. వాహనాలను వేగంగా నడపరాదు. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– మారిశెట్టి తేజోనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, కోరుకొండ

పరిమితికి మించి అనుమతించరాదు

మట్టి, గ్రావెల్, కంకర, నల్లరాయి, ఇసుక రవాణాలో పరిమితులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. రాత్రి వేళల్లో నిర్వహించడానికి వాటికి అనుమతులు లేవు. అయినప్పటికీ నిర్వాహకులు నిబంధనలను పాటించడం లేదు. అధికారులు కనీసం పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– పసుపులేటి బుల్లియ్యనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం ఆరో రోజైన బుధవారం కొనసాగింది. ఎలుకల కారణంగా పంట నష్టం జరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ పద్ధతిలో నివారించడంపై అవగాహన పొందారు. కార్యక్రమంలో కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎలుకల సమస్య రైతులకు తీవ్రమైందన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

విస్తరణాధికార్ల హోదా మార్పుపై హర్షం

రంగంపేట: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారుల(ఈఓపీఆర్డీ) హోదా మార్పుపై ఏపీ ఈఓపీఆర్డీ అసోసియేషన్ అడ్‌హాక్ చైర్మన్, రంగంపేట ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం బుధవారం ఇక్కడ హర్షం వ్యక్తం చేశారు. ఈఓపీఆర్డీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా మార్చాలని దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఈఓపీఆర్డీ పేరును డిప్యూటీ ఎంపీడీఓగా మార్పు చేయడమే గాక, ఎంపీడీఓ పోస్టును డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నుంచి తప్పించినట్టు తెలిపారు. దీంతో ఎంపీడీఓ పదోన్నతికి ఫీడర్ కేటగిరీలో ఉన్న ఈఓపీఆర్డీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, కింది స్థాయిలో వివిధ గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు త్వరగా పదోన్నతులు రావడానికి మార్గం సుగమమైందన్నారు. అంతేగాక ఎంపీడీఓ, డీఎల్‌పీఓలు ఒకే కేడర్‌గా పరిగణించబడతారని చెప్పారు.

ఉత్పత్తులకు తగ్గట్టుగా ప్యాకింగ్ ఉండాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నటరాజ్

రాజానగరం: మార్కెట్‌లో ఉత్పత్తులకు తగ్గట్టుగా ప్యాకింగ్ ఉండాలని, అప్పుడే వినియోగదారులను ఆకట్టుకోగలుగుతారని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (హైదరాబాద్) డిప్యూటీ డైరెక్టర్ ఎస్.నటరాజ్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో బీటెక్ (అగ్రికల్చర్), గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ప్యాకింగ్ ఫర్ మెడికల్ డివైసెస్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏ ఉత్పత్తి అయినా ప్యాకింగ్ లేకుండా మార్కెట్‌లోకి రాదన్నారు. తయారీదారుకు, వినియోగదారుకు ప్యాకింగ్ ఓ వారధి వంటిదన్నారు. కరోనా వైరస్ విజృంభణ సమయంలో పనిచేసిన మూడు రంగాలకు చెందిన పరిశ్రమలలో ప్యాకింగ్ కీలకమైందన్నారు. ప్యాకింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొ. వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, బీటెక్ (అగ్రికల్చర్) హెచ్ఓడీ బి.బలరామ్ భగత్, డైరెక్టర్లు డాక్టర్ ఆర్ఎస్ రాజు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు





చింతపల్లిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ. చిత్రంలో జక్కంపూడి, గూడూరి, సూర్యనారాయణరెడ్డి తదితరులు, సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ
- చింతపల్లిలో ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం

పెదపూడి: ఎన్నికల హామీల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని, సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలతో ప్రజలను దెబ్బతీశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. పెదపూడి మండలం చింతపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆయనతో పాటు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, అన్ని మండలాల్లో వారానికోసారి ముఖ్య కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నాలుగేళ్లు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు నేడు డబ్బుల్లేవని సాకులు చెబుతూ, సంక్షేమ పథకాలను విస్మరించారని దుయ్యబట్టారు.

దాడులు ఎక్కువయ్యాయి: జక్కంపూడి

గెలుపోటములు శాశ్వతం కాదని, ఎన్నికల్లో గెలిచినప్పుడు మన ప్రవర్తన, చేసిన మంచి భవిష్యత్తును నిర్ణయిస్తుందని జక్కంపూడి రాజా అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనపర్తి నియోజకవర్గంలో దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఎత్తేశారని, ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇసుక, మట్టి ఏది దొరికితే అది దోచుకోవటమే కూటమి నేతలు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

పెంచిన ధరను ప్రభుత్వమే భరించాలి

గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ హయాంలో కేంద్రం గ్యాస్ సిలిండర్ రూ.50 పెంచితే, ఆ భారం ప్రజలపై పడరాదన్న ఉద్దేశంతో రాయితీగా అందించారని, అలాగే ప్రస్తుతం పెరిగిన గ్యాస్ సిలిండర్ రూ.50ను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంటి, వైస్ ఎంపీపీలు ద్వారంపూడి పద్మారెడ్డి, కరెడ్ల వెంకన్నబాబు, మాజీ ఎంపీపీ కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లు పెద్దకాపు, సర్పంచులు కొల్లు లోవకుమారి, సుందరపల్లి ప్రమీల, మీనవల్లి శారదదేవి, ఎంపీటీసీ సభ్యులు సుందరపల్లి సుధాకర్, సమ్మంగి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు మార్ని కామరాజుచౌదరి, గుండా ఈశ్వరరావు, పార్టీ నాయకులు మందపల్లి బుల్లిరాజు, కొల్లు సత్తిబాబు పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు గ్రామ సభల ఆమోదం తప్పనిసరి



వేండ్రలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ఆక్వా సాగు చేపట్టడానికి గ్రామ సభల ఆమోదం తప్పనిసరిగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పైన, పుట్టకొండ, వేండ్ర, పెద్దాడ గ్రామాల్లో ఆక్వాసాగు అనుమతులపై గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా ఆక్వాసాగు చేపట్టాలంటే మొదటగా ఆ భూమి ఆక్వా జోన్‌లో ఉండాలన్నారు. అలాగే గ్రామ సభ, మండల స్థాయి కమిటీ ఆమోదం తప్పనిసరిగా ఉండాలన్నారు. అయితే 2022 నుంచి గ్రామాల్లో ఆక్వా సాగు చేస్తున్న సర్వే నంబర్లపై రైతులు, ప్రజలకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఆ సర్వే నంబర్లు ఆక్వా జోన్‌లో ఉండి, ప్రజల ఆమోదం ఉంటేనే వాటిని కొనసాగిస్తారన్నారు. అలాగే గ్రామాల్లో వరి, ఇతర పంటలకు అనువుగా లేని భూముల్లో ఆక్వా సాగుకు దరఖాస్తు చేసుకుంటే వాటిని గ్రామ సభల్లో పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు సుందరపల్లి ప్రమీల, కోసూరి వాసు, దొకుబుర్ర మీనాక్షి, వల్లు వెంకటరమణ, మత్స్య శాఖ గ్రామ సహాయకులు పరుశరామ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చిన్న హంస కుటుంబానికి పరామర్శ



చిన్నహంస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేణు, జక్కంపూడి, గూడూరి, సూర్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: వైఎస్సార్ సీపీ జి.మామిడాడ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి(చిన్న హంస) ఇటీవల మృతి చెందారు. ఆయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి, సోదరుడు వెంకటరమణారెడ్డి, కుమారుడు శివప్రభాకర్‌రెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న హంస చిత్రపటానికి నివాళులర్పించారు. వీరి వెంట సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సత్తి భగవాన్‌రెడ్డి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

రామకృష్ణారెడ్డి కుటుంబానికి..

వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు) నాన్నమ్మ సత్తి సూరయమ్మ ఇటీవల మృతి చెందారు. రామకృష్ణారెడ్డిని శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పరామర్శించారు. తొలుత సూరయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరి వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, రంగంపేట మండల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీ మోహన్‌బాల కృష్ణారెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ నల్లమిల్లి వేణురెడ్డి, విజయరెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్ కమ్ రైలు వంతెన మార్గాన్ని తీర్చిదిద్దాలి

కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: భవిష్యత్తులో వాహనాల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రోడ్ కమ్ రైలు వంతెనకు వెళ్లే మార్గాన్ని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ధార్వాడ అపార్ట్‌మెంట్ వరకు తీర్చిదిద్దాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. నగర ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా, ఆరోగ్య విభాగం అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం రోడ్ కమ్ రైలు వంతెనకు వెళ్లే రహదారిని పరిశీలించారు. రహదారిని అభివృద్ధి చేసే విషయమై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులకు విస్తరించాల్సి ఉన్నందున, ఆ మేరకు అవసరమైన వారికి వారంలో ఇవ్వటానికి టీడీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌ను తిరిగి నిర్మించాలని, ఆక్రమణలను తక్షణం తొలగించాలన్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న వీధులకు సక్రమంగా అప్రోచ్ రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. డ్రైన్లలో వ్యర్థాలను తొలగించాలని, రోడ్డును శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మున్సిపల్ ఆరోగ్యాధికారిని డా. ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి, సెక్రటరీ శైలజావల్లి, డీఈఈ సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ ఉన్నారు.



రోడ్ కమ్ రైలు బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరతో పాటు, పెట్రో ఉత్పత్తుల ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలో భాగంగా స్థానిక శ్యామలాసెంటర్‌లో ఖాళీ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్‌తో పాటు, అన్ని రకాలా ధరలు పెంచి ప్రజల నెత్తిన భారం మోపడమే సీఎం చంద్రబాబు పీ–4 ఉద్దేశమని, ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, ఇతర భారాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించి, ధరలు తగ్గించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా, దేశంలో ఇంకా పెంచడం దారుణమన్నారు. అమెరికా అధ్యక్షుడి సుంకం విధానాల వలన రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఏర్పడిందని, దీనివల్ల అనేక కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి, పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.సుబ్రహ్మణ్యం, బి.పూర్ణిమరాజు, నగర కమిటీ నాయకులు వి.రాంబాబు పాల్గొన్నారు.



శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాజేశ్వరరావు జీవితం ఆదర్శప్రాయం

సీపీఐ జిల్లా కార్యదర్శి మధు



రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, భూ పోరాట యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు నేత చండ్ర రాజేశ్వరరావు జీవితాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం పార్టీ నగర కార్యదర్శి వి.కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రపంచ స్థాయి నేతగా రాజేశ్వరరావు ఎదిగారని, దేశ స్వాతంత్ర్యం కోసం వివిధ దశల్లో జరిగిన ప్రజా ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. చల్లపల్లి జమీందార్ ఆక్రమణలో ఉన్న వేలాది ఎకరాలను పోరాటాలు చేసి పేదలైన వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేశారన్నారు. పేదరికం తగ్గాలంటే భూమి సమస్య పరిష్కారం కావాలని, పేదలకు భూములు దక్కాలని బలంగా నమ్మేవారిని కొనియాడారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రజా సంఘాల నిర్మాణానికి విలువైన సూత్రాలను ఆయన అందించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, పార్టీ పటిష్ట నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు.

ప్రకృతి విపత్తులపై శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

సీతానగరం: ప్రకృతి విపత్తుల్లో ప్రమాదాల నియంత్రణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. డిజాస్టర్ రిస్క్ రిడెక్షన్ ట్రైనర్ డి.శ్రీనివాస్ శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన తొలి రోజు శిక్షణలో మండల స్థాయి అధికారులు ప్రసంగించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొని, నష్ట నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీఓ కె.సూర్యరమేష్ మాట్లాడుతూ, తుపాన్ల సమయంలో రైతుల పంటలకు నష్టం కలగకుండా సూచనలు అందిస్తున్నామన్నారు. తుపాన్లపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పంట కోతలు జరపరాదని, పొలంలో నీరు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ, వరదలు, తుపాన్ల సమయాల్లో ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీటినే తాగాలన్నారు. డయేరియా వంటి రోగాల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ ఫణీంద్ర, ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.